www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 17 డిసెంబర్ 2024



పీస్ స్కూల్ విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి- కడప అర్బన్

ఇంటర్ స్కూల్ తేక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు ఈనె 15న తిరు పతి గిరిజన భవనం నిర్వహించారు. 35 కిలోల ఛాలెంజింగ్ విభాగంలో పీస్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ ఇబ్రహీం ప్రతిభ కనబరిచాడు. గోల్డ్ మెడల్‌తో పాటు రూ.1500 నగదు బహుమతి సాధిం చడంతో పీస్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్ హర్షం వ్యక్తం చేశారు. త్వరలో బెంగుళూరులో నిర్వహించనున్న ప్రిన్స్ ట్రోఫీ టోర్నమెంట్‌లో పాల్గొని విజయం సాధిస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు.



పక్కా గృహాలకు గ్రహణం

- ముందుకు సాగని కట్టడాలు
- ఆగిన బిల్లులు
- వివిధ దశల్లో నిర్మాణాలు
- లే అవుట్లలో కనీస వసతులు నిల్
- ఎప్పటికి పూర్తయ్యేనో?
- లబ్ధిదారుల్లో ఆందోళన



ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

గత ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన గృహాల నిర్మాణాలు వివిధ దశల్లో మధ్యలో ఆగిపోయాయి. మండలవ్యాప్తంగా 1,729 గృహాలు మంజూరుకాగా, 936 పూర్తయ్యాయి. మిగిలిన 793 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు నిలిచిపోయాయి. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులో వేసిన లే అవుట్లలో 500 గృహాలు మధ్యలో ఆగిపోగా, పూర్తయిన వాటిల్లో కనీస వసతులులేవు. కేవలం 20 కుటుంబాలు మాత్రమే వాటిల్లో చేరాయి. రోడ్లు లేవని, స్థానికంగా వేసిన బోర్లలో ఉప్పునీరు వస్తోందని, దొంగల సంచారం ఎక్కువగా ఉందని వారిలో భయాందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వం కనీస వసతులు కల్పిస్తే ఇంకా కొంతమంది చేరే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన రూ.లక్ష ఎనభై వేలతోపాటు తాము కొంత వెచ్చించి ఇళ్లను కట్టుకున్నా.. అక్కడ కనీస వసతుల్లేవని లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. తాహతుకు మించి అప్పులు చేసి సొంత ఇంటి కల నెరవేర్చుకున్నామన్నారు. అందులో ఉండేందుకు వసతుల్లేవని, అప్పులపాలయ్యామని వాపోతున్నారు. మధ్యలో బిల్లులు ఆగిపోయిన గృహాలకు ప్రభుత్వం ఎంత మేరకు సహకరిస్తుందా అని ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం గృహాలు మంజూరు చేసి లే అవుట్లను రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చింది. ఆ లే అవుట్‌లలో ఇంటి నిర్మాణాలు ప్రారంభం కాని వాటిని ప్రభుత్వం వెనక్కి తీసుకోబోతున్నట్లు చెబుతోంది. వారికి కూటమి ప్రభుత్వం కొత్తగా లే అవుట్లను మంజూరు చేసి ఇళ్లు మంజూరు చేయబోతుందని సమాచారం. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ.4లక్షలు ఇస్తామని చెప్పింది. త్వరలో ఈ ప్రక్రియ ప్రారంభించనున్నట్లు సమా చారం. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు వేర్వేరుగా దరఖాస్తు ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా గత వైసిపి ప్రభుత్వంలో 20, 04,870 గృహాలు మంజు రవగా వాటిలో సుమారు 8 లక్షలు వివిధ దశలలో నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి త్వరలో అధికారులు సర్వే పూర్తి చేయనున్నట్లు తెలిసింది. టిట్కో వారు నిర్మించిన అపార్ట్మెంట్లు నిర్మాణం పూర్తయి కూడా లబ్ధిదారులకు అందకుండా పోయింది. ప్రస్తుతం ఆ సమస్య కోర్టులో ఉంది. వాటిల్లో తలుపులు, కిటికీలు మొదలు అన్నిటిని చోరీకి గురవుతున్నాయి. రూ.కోట్ల ప్రభుత్వ సొమ్ము దోపిడీకి గురవుతూ ప్రజలకు అందకుండా పోతోంది.



మొండి గోడలకు పరిమితమైన పక్కాగృహం

కనీస సౌకర్యాల్లేవు



ఇక్కడ దొంగలు ఎక్కు వగా తిరుగుతున్నారు. రాత్రి పూట చాలా భయమేస్తోంది. పింఛను, రేషన్ కార్డు ముద్దనూరు రోడ్డు మహాత్మ నగర్‌లో ఉంది. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్లి తెచ్చు కునేందుకు చాలా ఇబ్బందులు పడు తున్నాను. రోడ్లు బాగో లేకపోవడంతో ఆటోలు కూడా రావు.

- హుసేనమ్మ, లబ్ధిదారురాలు

వసతుల్లేక చేరడంలేదు



ప్రభుత్వం ఇచ్చిన సొమ్ముతో కాకుండా అధికంగా రూ.10 లక్షలు ఖర్చు చేసి ఇంటిని బాగా నిర్మించుకున్నాం. ఇక్కడ రోడ్లు లేవు. వసతులు లేక ఎవరూ చేరడం లేదు. మగవారు పనికి పోతే ఒంటరిగా ఉండాలంటే భయమేస్తోంది. నిత్యా వసర సరుకులు, తాగునీరుకు చాలా దూరం వెళ్లాల్సి ఉంది. అధికారులు రోడ్లు వేయించి కనీస వసతులు కల్పించాలి. వసతులు కల్పిస్తే చాలామంది ఇక్కడ చేరుతారు.

- అమ్మణ్ణి, స్థానిక నివాసి

ట్రూ అప్ ఛార్జీలు ఉపసంహరించుకోవాలి

'కూటమి' ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి
సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్
అంబేద్కర్ సర్కిల్‌లో విద్యుత్ బిల్లులు దహనం



అంబేద్కర్ సర్కిల్ వద్ద నిరసన తెలియజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- కడప అర్బన్

ట్రూప్ ఛార్జీలు ఉపసంహరించుకుని, ప్రజలపై మోపిన విద్యుత్ భారాన్ని తగ్గించాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్‌లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు అధికా రంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచబో మని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీ అమలుకు కట్టుబడి ఉండాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. కడప జిల్లాలో 10 లక్షలకు పైగా విద్యుత్ వినియోగదారులు ఉన్నారని, ప్రతి వినియోగదారుడి మీద సాధారణంగా వచ్చే బిల్లుకు అదనంగా రూ.60 నుంచి రూ.120 శాతం దాకా భారం పడిందన్నారు. ప్రతి కుటుంబానికి ఈ ఛార్జీలు అదనపు భారంగా మారిందన్నారు. విద్యుత్ రంగంలో కీలకమైన మార్పులు తెచ్చి ప్రజల మీద పెద్ద ఎత్తున భారాలు మోపుతున్నారని విమర్శించారు. స్మార్ట్ మీటర్ల బిగింపు వల్ల ప్రతి వినియోగదారుడికి రూ.10 వేల నుంచి రూ.25వేల దాకా అదనపు భారం పడబోతుందన్నారు. పీక్ అవర్ డిమాండ్ పేరుతో విద్యుత్ వినియోగాన్ని, వినియోగించే కాలాన్ని బట్టి యూనిట్ ధర నిర్ణయిస్తున్నారని పేర్కొన్నారు. ఈ పద్ధతి అమలు అయితే విద్యుత్ సమృద్ధిగా అందుబాటులో ఉన్నా సామాన్య ప్రజానీకం విద్యుత్తును వినియోగించే స్థితి లేకుండా పోతుందన్నారు. విద్యుత్ రంగాన్ని ముక్కలు చేసి ప్రయివేట్ వ్యక్తులకు ఇప్పటికే అప్పగించేందుకు ప్రయత్నాలు వేగవంతం చేశారన్నారు. రానున్న రోజుల్లో సబ్ స్టేషన్ల వారీగా కాంట్రాక్టుకు ఇచ్చి కాంట్రాక్టర్లకు నచ్చిన వారికే విద్యుత్ అందుబాటులో ఉండేలా చేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని విమర్శించారు. విద్యుత్ రంగ సంస్కరణలు సామాన్య ప్రజలకు నాణ్యమైన, మెరుగైన విద్యుత్‌ను అందించాలే తప్ప ప్రజానీకం మీద భారాలు వేసేదిగా ఉండకూడదన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజానీకం పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి, గోపాలకృష్ణయ్య, హరిచంద్రారెడ్డి, సాంబశివారెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహ, విజయ్, మోహన్ కృష్ణ, వెంకట సుబ్బయ్య,మాధవ రెడ్డి, సరిత పాల్గొన్నారు.



విద్యుత్ బిల్లులు దహనం చేస్తున్న నాయకులు

ప్రమాద వశాత్తు ఆర్‌టిపిపి కాంట్రాక్టు కార్మికుడు మృతి

- మృతదేహంతో బంధువులు, కార్మికుల నిరసన
- రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్
- రూ.15 లక్షల నగదు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తామన్న యాజమాన్యం
- ఆందోళన విరమించిన బాధితులు



ఆర్‌టిపిపి మెయిన్ గేట్ వద్ద మృతదేహంతో ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు, కార్మికులు

ప్రజాశక్తి -ఎర్రగుంట్ల

మండలంలో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్‌టిపిపి)లో సోమవారం ప్రమాదవశాత్తు కాంట్రాక్టు కార్మికుడు మృతి చెందాడు. వివరాలు.. మండలంలోని కదిరాపల్లెకు చెందిన సందీప్ (28) ఆర్‌టిపిపిలోని నాగార్జున కన్‌స్ట్రన్స్ కంపెనీలో ఫ్లయాష్ (బూడిద) విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. 15 రోజులపాటు ఫ్లయాష్ ప్లాంట్‌ను షట్‌డౌన్ చేశారు. సోమవారం పైపులో పేరుకుపోయిన ఫ్లయాష్‌ను కార్మికులచే శుభ్రం చేయించారు. ఈనేపథ్యంలో శుభ్రం చేస్తున్న సందీప్‌పై ఒక్క సారిగా ఫ్లయాష్ మీదపడింది. దీంతో అతను ఫ్లయాష్‌లోనే కూరుకుపోయాడు. గుర్తించిన తోటి కార్మికులు బూడిదను తొలగించి బయటకు తీశారు. అప్పటికే అతను మృతిచెందాడు. మృతుడికి భార్య, మూడు నెలల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న కుటుంబం సభ్యులు ఆర్‌టిపిపి వద్దకు చేరుకుని బోరున విలపించారు. కుటుంబానికి అండగా ఉన్న యజమాని మృతిచెందాడని, తమకు దిక్కెవరని విలపించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభు త్వాస్పత్రికి తరలించారు.



మృతి చెందిన కార్మికుడు సందీప్

మృతదేహంతో బంధువులు, కార్మికుల ధర్నా

ప్రమాదవశాత్తు చనిపోయిన కార్మికుడు సందీప్ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ అతని బంధుమిత్రులు, కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు మృతదేహంతో ఆర్‌టిపిపి గేటు వద్ద ఆందోళన నిర్వహించారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్‌టిపిపిలో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఉన్నతాధికారులు, సదరు కాంట్రాక్టు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అన్వేష్ పేర్కొన్నారు. గతంలో విశాఖ, విజయనం తదితర ప్రాంతాల్లో ప్రమాదంలో చనిపోయిన మృతుల కుటుంబాలకు పరిహారంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇచ్చారని, అలాగే సందీప్ కుటుంబానికి పరిహారంతోపాటు ఉద్యోగం ఇవ్వాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. జిల్లా లో సిమెంటు, ఇతర పరిశ్రమలు కార్మికుల భద్రత గాలికి వదిలేశారు అన్నారు. దీనికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. స్పందించిన యాజమాన్యం ఆందోళన చేస్తున్న బాధితుల వద్దకు వచ్చి సందీప్ కుటుంబానికి రూ. 15 లక్షల నగదు, అవుట్ సోర్సింగ్ కింద కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చింది. దీంతో వారు ఆందోళన విరమించారు.

తేక్వాండో శిక్షణతో మానసిక ధైర్యం : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్ :

తేక్వాండో శిక్షణతో విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం పెరిగి, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని వైవీయూ విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి అన్నారు. 'ఫిట్ ఇండియా' వారోత్సవాలలో భాగంగా సోమవారం యోగివేమన విశ్వవిద్యాలయ వసతి గృహాల విద్యార్థినులకు క్యాంపస్‌లో తైక్వాండో శిక్షణ తరగతులను విసి, పీజీ కళాశాల ప్రిన్సిపల్, హాస్టళ్ల చీఫ్ వార్డన్ రఘునాథరెడ్డి, రిజి స్ట్రార్ ఆచార్య పి.పద్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాటాడుతూ తేక్వాండో మానసిక క్రమశిక్షణ మాత్రమే కాకుండా క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తుందన్నారు. ఎన్ని ప్రతినుకూల పరిస్థితులు వచ్చినా మానసికంగా దృఢంగా ఉంటూ ముందుకెళ్లాలన్నారు. భయం మనిషిని అచేతనంగా చేస్తుందని, ధైర్యం అనంత శక్తిని ఇస్తుందని ఉద్బోధించారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడుతూ రోజూ ఉదయం, సాయంత్రం గంటన్నరపాటూ నిపుణులు శిక్షణ ఇస్తారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థినులకు వారం రోజులపాటు ఆదనంగా పౌష్టికాహారం అందజేస్తామన్నారు. ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ అమ్మాయిలు నిత్యం ధైర్యంగా ఉండాలన్నారు. తేక్వాండో మిమ్మల్ని శారీరకంగా దృఢత్వాన్ని కలిగిన వారుగా తయారు చేస్తుందన్నారు. ఇది ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయ పడుతుందని నిపుణులు నాగూర్ బాబు మాట్లాడుతూ తేక్వాండో నైపుణ్యాలను నేర్పే ఒక యుద్ధ కళ అని వివరించారు. కార్యక్రమంలో వసతి గృహ అధికారి డాక్టర్ సునీత , విద్యార్థినులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న వెంకటరామిరెడ్డి

కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా తో మాట్లాడారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యంతర భృతి, 12వ పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేస్తామని, ఉద్యోగులకు రావాల్సిన అన్ని బకాయిలు చెల్లిస్తామని చెప్పి విస్మరించారన్నారు. ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యలపై ఒక్క మాట మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి, పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలన్నారు. ఇంకా ఉద్యోగులకు రావలసిన రూ.25 వేల కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇప్పటికైనా ఉద్యోగ సంఘాలచే జాయింట్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి, జిల్లా కో - చైర్మన్లు పి.వి.సుబ్బారెడ్డి, వల్లెం సుబ్బారెడ్డి, శివ శేషాద్రి రెడ్డి, మధు, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.

19 నుంచి 'గుడ్ గవర్నెన్స్‌వీక్'

ప్రజాశక్తి - కడప

"ప్రశాసన్ గావోన్‌కి ఒర్-2024' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 24 వరకు గుడ్ గవర్నెన్స్ వీక్ ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నామని, విజయవంతం చేయాలని డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు అధికారులను అదేశించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం కార్యాలయం నుంచి గుడ్ గవర్నెన్స్ వీక్ ప్రచార ప్రణాళికపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కార్యక్రమానికి డిఆర్ఓతోపాటు జడ్‌పిసిఇఓ ఓబులమ్మ, ఇన్‌ఛార్జి సిపిఓ హాజరతయ్య, డిఐఓ డాక్టర్ విజయ్‌కుమార్, డిఐపిఆర్ఓ వేణుగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. పబ్లిక్ సర్వీస్ డెలివరీని మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన పెంచాలన్నారు.

అర్జీదారులకు నాణ్యమైన పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)లో ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యా దుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారించి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జెసి అదితిసింగ్, డిఆర్ఓ విశ్వేశ్వర్ నాయుడు, డిఆర్‌డిఎ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావు, ఎస్‌డిసిలు వెంకటపతి, వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఎఎస్‌పి కె. ప్రకాష్ బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్‌పి వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ఫిర్యాదు దారులు స్వీకరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లా వ్యాప్తంగా గ్రామపంచాయతీలోని స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అదితి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి వేతనాలు రాకపోవడం చాలా బాధాకరమని తెలిపారు. ఇచ్చే వేతనాలు సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జమ్మలమడుగు ప్రాంతంలో కేవలం కొన్ని గ్రామాలలో రూ.3 వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. జనాభా ఆధారంగా రూ.6 వేల నుంచి రూ.10 వేలు ఇవ్వాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

ప్రజాశక్తి - కడప : సిబ్బంది శ్రద్ధగా శిక్షణను తీసుకొని విధి నిర్వహణలో ఎదురయ్యే విపత్తులను భద్రతతో సమర్థవంతంగా ఎదుర్కోవాలని ఎంఆర్‌టి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణరెడ్డి సూచించారు. భారత ప్రభుత్వ అధికార మంత్రిత్వ శాఖ వారి ఆధ్వర్యంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ 'కార్యాచరణ భద్రత, విపత్తు నిర్వహణ' పై శిక్షణను సోమవారం ఎపిఎస్‌పిడిఎల్ కడప విద్యుత్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ ఈనెల 18 వరకు మూడు రోజుల పాటు కడప విద్యుత్ భవన్ లోని శిక్షణా కేంద్రంలో నిర్వహిస్తామన్నారు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, ఎదుర్కో వడంలో తీసుకునే భద్రతల గురించి తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీకృష్ణదేవ, ఎన్‌పిటిఐ డైరెక్టర్ కె. ముత్తుకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు శిక్షణ

ప్రజాశక్తి - కడప : మధ్యవర్తిత్వంపై న్యాయవాదులకు సోమవారం మొదటి అదనపు జిల్లా జడ్జి, ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్ కుమార్ జిల్లా కోర్టులోని న్యాయ సేవాసదన్ భవన్ లో 40 గంటల శిక్షణ అనే అంశంపై ప్రారంభ సెషన్ కార్యక్రమం న్యాయవాదులతో నిర్వహించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యవర్తిత్వం అనేది ఒక ప్రక్రియ, ఇది వివాదాలను పరిష్కరిస్తున్న మంచి పద్ధతి అని తెలిపారు. ఖర్చు, సమయాన్ని ఆదా చేస్తుందన్నారు. కార్యక్రమంలో మిస్ బీనా దేవరాజ్, కర్ణాటక, తమిళనాడు ట్రైనర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న న్యాయవాదులతో జడ్జిలు వెంకటేశ్వరరావు, ప్రవీణ్ కుమార్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

కోవిడ్, అడిషనల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న మూడు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచుపాటి శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. డ్రైవర్ల కమిటీ కార్యదర్శి సుంకర కిరణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ కోవిడ్, అడిషనల్ కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణమే అకౌంట్‌లో వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. క్రిస్మస్ పండగ చేసుకునే వారిలో అధిక శాతం మంది కార్మికులున్నారని చెప్పారు. పండగ పూట వారిని, వారి కుటుంబాలను పస్తులు పెట్టొద్దని కోరారు. నగర సహాయ కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ ఆరేళ్లుగా పనిచేస్తున్న కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. వీటివల్ల కార్మికులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో పర్మినెంట్ కార్మికుల నాయకులు తొండ మస్తాన్, ఎం.ఆశ బాబు, కార్మికులు పాల్గొన్నారు.




కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీరామ్

డ్రోన్ సాంకేతికతతో వ్యవసాయం

ప్రజాశక్తి - కడప అర్బన్

కెఎస్ఆర్ఎం కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ వారు సోమవారం వ్యవసాయ రంగంలో సాంకేతిక పరి జ్ఞానం, డ్రోన్ చిత్రాలతో కృత్రిమ మేధస్సు ఉపయోగించి వర్క్ షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిఎస్ఇ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.ప్రకాష్ మాట్లాడుతూ డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పంటల పరిశీలన, వ్యవసాయ నిర్వహణ, ఆధునిక కాలంలో అధిక ఉత్పత్తి, ఆర్థిక సంవత్సరం ఖచ్చితమైన రైతు ఆదాయం పెంపు వంటి అనేక రకాల విషయాల మీద ప్రసంగించారు. విశిష్టమైన ఎడ్యుకేటర్ రీజర్చేర్ ఉజ్వల మాట్లాడుతూ డ్రోన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలియజేశారు. మల్టీ-స్పెక్ట్రల్ రైతులు తమ పంటల పరిస్థితిని వాస్తవ సమయంలో తెలుసుకోవడంతో వ్యవసాయ రంగంలో తీవ్ర మార్పు సాధ్యం అవుతోందని పేర్కొన్నారు. ఈ తాంత్రిక వర్క్షాప్ రైతుల జీవితాలను మార్చగలదని చెప్పారు. భవిష్యత్తు వ్యవసాయం ఇక్కడే ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.ఎస్ మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్, ప్రోగ్రామ్ కన్వీనర్, హెచ్ఒడి డాక్టర్ విజయ కిషోర్, కన్వీనర్లు డాక్టర్ డి. అరుణ్ కుమార్, ఎం.ప్రభాకర్, వివిధ రాష్ట్రాల నుంచి అధ్యాపక బృందం పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌కు హాజరైన అతిథులు

రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్‌కు సన్మానం

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్ర ఖజానా శాఖ రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన గోవింద రవికుమార్‌ను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర కోశాధికారి డాక్టర్ శివా నాయక్ ఘనంగా సన్మానించారు. సోమవారం కడప సబ్ ట్రెస్సరీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షునికి శాలువా, బొకేతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శివానాయక్ మాట్లాడుతూ ఈనెల 15న తిరుపతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖజానా శాఖ ఉద్యోగుల సమావేశంలో రాష్ట్ర ఖజానా శాఖ రాష్ట్ర అధ్యక్షులుగా కడప సబ్ ట్రెస్సరీ ఆఫీసర్ రవి కుమార్‌ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జగన్ రాథోడ్, శ్రీనివాస్ నాయక్, అర్జున్ నాయక్, బాబు నాయక్, కృష్ణ నాయక్, జయరాం నాయక్, కిరణ్ నాయక్, మణికంఠ నాయక్ పాల్గొన్నారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న బంజారా సేవా సంఘం నాయకులు



పంటలను పరిశీలిస్తున్న ఎఒ వెంకటకృష్ణారెడ్డి

రసం పీల్చు పురుగు ఉధృతికి నివారణ చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

పొద్దుతిరుగుడు పంటలో రసం పీల్చే పురుగు ఉధృతి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. పెనికలపాడు గ్రామంలో రబీలో సాగు చేసిన పొద్దుతిరుగుడు, శనగ పంటలను సోమవారం ఎఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దుతిరుగుడు పంటలో రసం పీల్చే పురుగు, తెల్ల దోమ, పచ్చ దోమ, పేనుబంక పురుగు ఎక్కువగా ఉందన్నారు. నివారణకు పొలంలో ఎకరానికి 10 ప్రకారం పసుపు రంగు జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేప నూనె 5 ఎంఎల్ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. క్వినాల్ ఫాస్ 2ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అసిఫేట్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. పొలంలో ఎకరానికి 8 చొప్పున పక్షి స్థావరాలు ఏర్పాటు చేస్తే పక్షులు పురుగులను ఏరి తినేస్తాయన్నారు. శనగ పంటలో పురుగు నివారణకు బార జైద్ మందును 500 లీటర్ల ట్యాంక్‌కు 350 ఎంఎల్ చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. శనగ బుడ్డలు ఏర్పడుతున్న సమయంలో 13.0.45 (పొటాషియం నైట్రేట్) 10 గ్రాములు చొప్పున ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే మంచి దిగుబడి, నాణ్యమైన గింజలు వస్తాయన్నారు. అవసరం మేరకే పురుగు మందులను వాడాలన్నారు.

రేపు సుంకులుగారిపల్లెలో ఆరాధన

ప్రజాశక్తి - మైదుకూరు (చాపాడు)

మైదుకూరు మండలం సుంకులుగారిపల్లెలో మదచలపేక బృందావన ఆశ్రమంలో మార్గశిర మాస బహుళ తదియ తిథిని పురస్కరించుకుని బుధవారం దేశికేంద్రులు సద్గురు అట్లవరపు నారాయణరెడ్డి స్వామి 29వ వార్షిక ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నామని ఆశ్రమ ఆచలగురు పీఠాధిపతి వారణ పిచ్చయ్యార్యులు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఉంటాయని తెలిపారు. గురుభోధోద్ధారకులు పాత్యం రామిరెడ్డి, యెరిసెట్టి కృష్ణయ్య, కుప్పన్నగారి రాఘవరెడ్డి ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తారని పిచ్చయ్యార్యులు వివరించారు. కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా గురుభక్తులు తరలివస్తారని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి గ్రామాల అభివృద్ధికి శిక్షణ

ప్రజాశక్తి - చాపాడు

స్వచ్ఛత, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు ఎంపిక చేసుకొని గ్రామాల అభివృద్ధికి కృషి చేసేందుకు సిబ్బందికి మంగళ, బుధవారాల్లో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఒ వీర కిషోర్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విఆర్‌ఒలు, సర్వేయర్లు, జెఎసిఎస్‌లు, ఎఎన్‌ఎంలు, ఎన్నిర్ అసిస్టెంట్‌లకు రెండు రోజుల శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమానికి సిబ్బంది తప్పక హాజరు కావాలని ఆయన సూచించారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో టిడిపి నాయకులు

కార్యకర్తల సంక్షేమమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి - ఖాజీపేట

కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా టిడిపి పనిచేస్తుందని, ప్రతి ఒక్కరూ పార్టీ సభ్యత్వం తీసుకొని ప్రయోజనం పొందాలని ఆ పార్టీ కడప జిల్లా మైనారిటీ జాయింట్ సెక్రెటరీ కమలాపురం గౌస్‌మొహిద్దీన్ కోరారు. పుల్లూరు పంచాయతీలోని సర్వర్‌ఖాన్‌పేటలో సోమవారం టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. రెండేళ్ల కాల పరిమితికి రూ.100 సభ్యత్వం ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే రూ.5లక్షలు పరిహారం వస్తుందన్నారు. సాధారణ మరణం అయితే రూ.2లక్షల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు. అలాంటి వారికి పార్టీ అన్ని విధాలా అండగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి, మంత్రి సుధాకర్ యాదవ్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ నాయకులు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యంలో విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - వేంపల్లె

కాశినాయన ఆలయంలో జరిగిన ఆరాధన వేడుకల్లో శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. వీరపునాయునిపల్లె మండలం పాలగిరి క్రాస్ వద్ద ఉన్న కాశి నాయన ఆలయంలో కాశినాయన 29వ ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పలు నాటకాలను విద్యార్థులు ప్రదర్శించారు. విద్యార్థులు తమ ప్రత్యేకతను చాటుతూ కుచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా ప్రశంసలు పొందారు. ఆలయ ధర్మకర్తలు వెంకటసుబ్బారెడ్డి, విశ్వనాథరెడ్డి, నారాయణ స్వామి విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఇలాంటి ఉత్సవాలు సంప్రదాయాలను ప్రోత్సహించడమే కాకుండా యువ ప్రతిభావంతులకు సత్తా చాటుకునే వేదికగా నిలుస్తాయని పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు.

అంధుల ఆశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పట్టణంలోని వీరనారాయణ స్వామి అంధుల ఆశ్రమంలో సోమవారం ఆలూరు గంగులప్ప 17వ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి ఆలూరు తులసమ్మ కుమారులు, ఆలూరు నరసింహులు, ఆలూరు గంగాధర్ కుమార్, కోడళ్లు ఉమాదేవి, జయంతి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు సహాయం చేసే పేదలను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో గంగులప్ప కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు అనిమల రామ్మోహన్, పాల్గొన్నారు.



అరటి పండు ఇస్తున్న గంగులప్ప కుటుంబ సభ్యులు

ప్రధాన రహదారుల్లో పారిశుధ్యం.. అధ్వానం

ప్రజాశక్తి -చాపాడు

మైదుకూరు పట్టణం ప్రధాన రహదారుల్లో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పారిశుధ్య కార్మికులు వ్యర్థ పదార్థాలను క్రమం తప్పకుండా తొలగించడంలో ఆలస్యం చేస్తున్నారు. తొట్లలో వేస్తున్న వ్యర్థ పదార్థాలు ఎక్కువ రోజులు తొలగించకపోవడంతో పందులు, ఇతర జంతువులు వాటి చుట్టూ చేరి అపరిశుభ్రతకు కారణమవుతున్నాయి. ముఖ్యంగా సర్వాయిపల్లె రోడ్డులో వ్యర్థ పదార్థాలు రోడ్డుపై వేస్తున్నాయి. ఆ ప్రాంతవాసులు దుర్వాసన భరితంచేకున్నామని వాపోతున్నారు. నంద్యాల రోడ్డు ప్రధాన రహదారిపై ఉన్న తొట్టిలో కూడా వ్యర్థ పదార్థాలు ప్రతిరోజు తొలగించకపోవడంతో అపరిశుభ్రత ఏర్పడుతోంది. మున్సిపాలిటీ అధికారులు వ్యర్థ పదార్థాలను తొలగించడంలో ప్రత్యేకశ్రద్ధ చూపి ప్రతి ప్రతి రోజూ తొట్లలోని వ్యర్థాలను తొలగిస్తే ప్రజలకు ఉపయోగకరంగా ఉం టుంది. లేనిపక్షంలో అపరిశుభ్రత ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడాల్సి వస్తుంది.



సర్వాయపల్లె రోడ్డులో నెలకొన్న అపరిశుభ్రత, చుట్టూ చేరిన పందులు

పులివెందులలో గెలుపు ఓ కొత్త మైలురాయి



మాట్లాడుతున్న టిడిపి జిల్లా కార్యదర్శి జయరామిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

నీటి సంఘం ఎన్నికలు ఏకగ్రీవం కావడం పులివెందులలో ఓ కొత్త మైలురాయి అని టిడిపి జిల్లా కార్యదర్శి ఎస్‌పి జయరామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం వేంపల్లెలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిత్యం ప్రజల కోసం పాటుపడడంతోపాటు ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు బిటెక్ రవి అన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న పులివెందుల నియోజకవర్గంలో 32 సాగునీటి సంఘాల ఎన్నికలు జరుగగా అన్నీ ఏకగ్రీవం కావడం ఎపిలోనే ఒక పెద్ద చరిత్ర అన్నారు. వైసిపి నేతల ఎత్తుగడలను బిటెక్ రవి అడ్డుకుని తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించారని తెలిపారు. పులివెందుల ప్రాంతంలో అభివృద్ధి కోరుకునే ప్రతి రైతు ఎన్నికల్లో ఏకగ్రీవానికి మద్దతు తెలిపారని ఆయన పేర్కొన్నారు. అన్ని ప్రాంతాల రైతులకు సహాయం అంది0చేందుకు టిడిపి మరింత నిబద్ధతతో ముందుకు సాగు తుందని తెలిపారు. గత జగన్ ప్రభుత్వంలో రైతులకు చేసిందేమి లేదని మండిపడ్డారు. టిడిపి ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో పాములూరు చంటి, వార్డు మెంబరు కంతూరి వెంకటేష్, శివకృష్ణారెడ్డి, ఆదిత్యారెడ్డి, రామాంజనేయులు, హరికుమార్ రెడ్డి, రాహుల్, సుదర్శన్ పాల్గొన్నారు.

అభివృద్ధికి నోచని మైదుకూరు మున్సిపాలిటీ




సిమెంట్ రోడ్లకు నోచుకోని సుందరయ్య కాలనీ

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 24 వార్డులు అన్ని రకాలా అభివృద్ధి చెందకుండా వెనుకబడి ఉంది. మున్సిపాలిటీ పరిధిలో ముఖ్యంగా సిమెంట్ రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉన్నాయి. ఏ ప్రాంతంలో చూసినా మురుగు కాలువలు, మురుగు కుంటల్లో కనిపిస్తూ ఇబ్బందికరంగా ఉన్నాయి. మున్సిపాలిటీ పరిధిలో 122 మురుగు కుంటలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీటిలో ప్రతినిత్యం పందులు తిరుగుతూ ప్రజల అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. దోమలు అధికంగా వృద్ధి చెందుతూ ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. మైదుకూరు మున్సిపాలిటీ ఏర్పడి పదేళ్లు కావస్తున్నా అభివృద్ధికి నోచుకోలేదు. కూరగాయల మార్కెట్‌కు ప్రత్యేకమైన స్థలం లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం వనిపెంట రోడ్డులో అంకాలమ్మ గుడి వద్ద కూరగాయల మార్కెట్‌ను అనధికారికంగా నిర్వహించుకుంటున్నారు. మైదుకూరు కేంద్రంగా వివిధ ప్రాంతాలకు వెళ్లే ఆటోలు, వాహనాలు నిలుపుకునే స్థలం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి రోడ్డులో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలో సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ లేకపోవడంతో పల్లె ప్రజలు, ఇతరులు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ పార్కు లేకపోవడంతో పిల్లలు ఆహ్లాదానికి దూరం అవుతున్నారు. వృద్ధులు, మహిళలు రోడ్లపైన ఉదయం, సాయంత్రం వేళల్లో వ్యాయామం కోసం నడవాల్సి వస్తోంది. పార్కుకు స్థలం కేటాయిస్తే అందరికీ ఉపయోగకరంగా ఉంటుంది. ఎమ్మెల్యే, మున్సిపాలిటీ పాలక వర్గం ప్రధాన సమస్యలను దృష్టిలో ఉంచుకొని పరిష్కరించే దిశగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు సూచిస్తున్నారు.



రోడ్డుపై కొనసాగుతున్న కూరగాయల మార్కెట్



అధ్వానంగా ఉన్న పారిశుధ్యం

నేడు చిట్లూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని చిట్లూరు కస్పా శివాలయంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారిచే ఉచిత వైద్య శిబిరం టిడిపి మండల నాయకులు గాలివీటి సురేంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు టిడిపి కార్యకర్తలు పేర్కొన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ శిబిరంలో కిడ్నీ, ఎముకలు, కీళు సంబంధిత వ్యాధులకు వైద్యం చేస్తామని పేర్కొన్నారు. అవకాశాన్ని రామాపురం, వీరవల్లి, లక్కిరెడ్డిపల్లి మండలాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చేవారు తప్పనిసరిగా ఆధార్‌కార్డ్, దీర్ఘకాల వ్యాధికి సంబంధించిన రోగులు వారి వద్ద ఉన్న రిపోర్టులు తీసుకు రావాలన్నారు. సమావేశంలో టిడిపి కార్యకర్తలు దేవదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు సాయం చేయడం సంతోషకరం

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని ప్రేమాలయం వృద్ధాశ్రమంలో రాయచోటి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వీరబల్లి మండలం సానిపాయి గ్రామానికి చెందిన పైడి వెంకటయ్య మూడవ వర్ధంతి పురస్కరించుకొని సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దాత పరమేశ్వర్ మాట్లాడుతూ తమ తండ్రి 3వ వర్ధంతి రోజున వృద్ధులకు అన్నదానం చేయడం మనసుకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది అన్నారు. ఇకపై ఆ కుటుంబంలో ఎలాంటి వేడుకల్లో జరిగిన సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అన్నదానం చేయడానికి సహకరించిన రాయచోటి లయన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ మహబూబ్‌బాషా, రాయచోటి అధ్యక్షులు శివారెడ్డి, వృద్ధాశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛా నీటి సంఘానికి ఎన్నికలు

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని ముడింపాడు పంచాయతీలో ఈనెల 14న నిర్వహించాల్సిన పింఛా ప్రాజెక్టు సాగునీటి సంఘానికి ఎన్నికలు దాడులు చోటు చేసుకోవడం వల్ల వాయిదా పడిందని, ఈనెల 17న నిర్వహిస్తామని ప్రాజెక్టు ఎఇ నాగేంద్ర నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరు మాత్రమే వచ్చి తన ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఇతరులు ఎవరూ పోలింగ్ కేంద్రానికి రాకూడదదన్నారు. ఎవరైనా వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పింఛా ప్రాజెక్టు కింద భూములున్న రైతులు మాత్రమే పాల్గొన్నాలని తెలిపారు.

పేద విద్యార్థుల కోసం కళాశాల ఏర్పాటు

సుండుపల్లి : మండలంలోని అక్కంపల్లి సమీపంలో బైరాగుట్ట ఎదురుగా తన సొంత నిధులతో పేద విద్యార్థుల కోసం కళాశాల ఏర్పాటు చేస్తున్నామని సమితి మాజీ ప్రెసిడెంట్ మల్లు శివారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ మండలంలోని మారుమూల ప్రాంతాల నుంచి పేద విద్యార్థులు ఎంతో ఖర్చులు పెట్టుకొని రాయచోటి, కడప, తిరుపతి ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కూలీ నాలీ చేసుకుని తమ పిల్లలను అంతదూరం పంపించి చదివించాలంటే తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని తెలిపారు. అలాంటి పేద విద్యార్థుల కోసం తమ సొంత నిధులు ఖర్చుపెట్టి కళాశాల నిర్మిస్తున్నామని చెప్పారు. విద్యార్థులకు సరిపడ అధ్యాపకులను, అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. లక్షలు వ్యయం చేసి కళాశాలను నిర్మిస్తున్నామని, పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానంలో ఉంటే తమకు ఆనందమన్నారు. అలాగే సాయిబాబు ఆలయం వద్ద ప్రతి శనివారమూ పేదలకు అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్‌సిఆర్ కల్యాణమండపం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో తాను రాయచోటి సమితి అధ్యక్షులుగా ప్రజలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. ప్రజా సేవే తనకు ముఖ్యమని మల్లు శివారెడ్డి వెల్లడించారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆర్‌అండ్‌బి డిఇ వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. రాయచోటి శివారు ప్రాంతమైన గాలివీడు రోడ్డులో ఉన్న అబ్బవరం గ్రామంలో సర్వే నెంబర్ 50లో వచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబ్బవరం గ్రామంలో సర్వేనెంబర్ 50లో ఓ ప్రయివేట్ వ్యక్తి తన హద్దుకు మించి నిర్మా ణాలను చేపడుతున్నారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఫిర్యాదు మేరకు తాము, రెవెన్యూ సిబ్బంది కలిసి సర్వే చేయించామన్నారు. పరిధికి మించి నిర్మించడంతో త్వరలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని డిఇ తెలి పారు. ప్రజలు ఎవరైనా తమ పరిధికి మించి నిర్మాణాలు చేపట్టరాదని, చేపడితే చట్టరీత్యా వాటిని తొలగిస్తామని హెచ్చరించారు.

పది టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

రాజంపేట అర్బన్ : పట్టణ శివారులోని మన్నూరు వద్ద కడప-తిరుపతి ప్రధాన రహదారిలో సోమవారం రూరల్ సిఐ మహమ్మద్‌అలీ పది టన్నుల ప్రభుత్వ రేషన్ బియ్యం తరలించే మినీ లారీని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. పది టన్నులు రేషన్ బియ్యం కలిగిన మినీ లారీ వాహనంతో పాటు డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. పట్టుబడిన బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పజెప్పనున్నట్లు, అలాగే డ్రైవర్, క్లీనర్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు తెలిపారు. పట్టుబడిన రేషన్ బియ్యం ఖరీదు సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అన్నారు.

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు

పులివెందుల రూరల్ : ఆధార్ ప్రత్యేక శిబి రాలను ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17 నుంచి 20వ తేదీ వరకు పులివెందుల పురపాలక సంఘ వార్డు పరిధిలోని అంగన్వాడీ సెంటర్లలోని బాలబాలికలకు, నిర్దేశించిన ప్రాంతాలో, సచివాలయాల్లో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 17న చెన్నారెడ్డి కాలనీ సచి వాయం, నగరిగుట్ట సచివాలయంలో.. 18న ప్రశాంతి నగర సచివాలయం, మున్సిపల్ మస్టర్ ఆఫీస్‌లో.. 19న పెద్దకొండప్ప కాలనీ సచివాలయం, భాకరాపురం సచివాలయంలో.. 20న ఉలిమెల్ల సచివాలయం, రాజీవ్ కాలనీ సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాలు నిర్వహిస్తున్నామన్నారు.

నేడు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నిక

సింహాద్రిపురం : కసనూరు, సింహాద్రిపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు చైర్మన్ ఎన్నికలు మంగళవారం జరగనున్నట్లు పిబిసి ఇఇ రాజశేఖర్ తెలిపారు. కసునూరు డిస్ట్రిబ్యూటరీ ఎన్నికలు అంకాలమ్మ గూడూరులోని పిబిసి కార్యాలయంలో, సింహాద్రిపురం డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు సింహాద్రిపురం తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కసునూరు డిస్ట్రి బ్యూటరీ పరిధిలో అనంతపురం జిల్లాలోని కల్లూరు, ఎల్లనూరు, కడప జిల్లాలోని కసనూరు, తొండూరు, సింహాద్రిపురం నీటి సంఘాల చైర్మన్లు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఎన్నుకోనున్నారు.

IN THE COURT OF THE HON'BLE ADDL., SENIOR CIVIL JUDGE, KADAPA

E.P.No. 9/ 2023

O.S.No. 308 /2017

B. Ganapathi Raj Chowdary, S/o B. Chowdary, D.No.41/568-234, Sankarapuram, Kadapa City.

... Petitioner/D.Hr.

Vs

Chitta Venkata Subba Reddy, S/o Late C. Subba Reddy, D.No.20/797, Co-operative Colony, Kadapa City.

...Respondent/J.Dr.

నోటీసు

పై E.P. లో డిక్రీ హెల్డర్ మీ పై డిక్రీ అమౌంట్ వసూలు కోరుచు మీ అరెస్ట్ గాను పైన కనపరిచిన కోర్టులో E.P. దాఖలు చేసి ఉన్నాడు. సదరు E.P. నీ హాజరు కొరకు 30/12/2024 ఉదయం 10:30 వాయిదా వేసి ఉన్నారు. కావున మీరు పై కన పరిచిన కోర్టులో సదరు తేదీన హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించ బడును.

//కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు//

జి. జ్ఞానప్రసాద్,
అడ్వకేట్,
కడప.

మహారాజశ్రీ డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్ కర్నూలు.

డిస్ప్యూట్ నెంబరు : 77/2024

శ్రీరామ్ రాఘవేంద్ర చిట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కర్నూలు బ్రాంచి. ..... డిస్‌పుటెంట్

వర్సెస్

D. Rani మరియు 4 ఇతరులు ..... అపోనెంట్స్

అపోనెంట్స్ 1కి నోటీసులు

1. P. Hussain Miah, S/o. P. Khajamiah, H.No. 6-6-163, 4th Line, Sivaram Krishna Nagar, Badwel, Kadapa (Dt.)

డిస్ప్యూట్ బాకీమొత్తం రూ. 10,48,351-00 రాబట్టుకొనుటకుగాను మీ పైన దాఖలు చేసిన డిస్ప్యూట్‌లో 1 వ అపోనెంట్స్ అయిన మీరు 10-01-2025 వ తేది రూజున ఉదయం 11-00 గంటలకు మీరుకానీ మీ తరపు న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకోవలెను. లేని యెడల సదరు డిస్ప్యూట్ దావా కాసు మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిదా : 10-01-2025

బై అర్డర్ ఆఫ్ డిప్యూటి రిజిస్ట్రర్ ఆఫ్ చిట్స్/అర్బిట్రేటర్, కర్నూలు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది

19 నుంచి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఈనెల 19నుంచి మూడు రోజుల పాటు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బాలుర క్రీడా పోటీలు కడప రీజినల్ స్థాయిలో జరుగుతాయని ప్రిన్సిపల్ జింక అశోక్‌బాబు తెలిపారు. జిల్లాస్థాయిలో 20 గవర్నమెంట్, ప్రయివేట్ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 384 మంది బాలురు వివిధ రకాల క్రీడల్లో పోటీ పడనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్, సిబ్బంది పోస్టర్లను విడుదల చేశారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఎస్ఆర్ఐటి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం వైజాగ్‌కు చెందిన ప్రముఖ కంపెనీ టాలెంట్ ల్యాబ్ బ్రింగ్ సక్సెస్ టుగెథర్ బిజినెస్ డెవలప్మెంట్ అసోసియేట్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఎంబిఎ విద్యార్థులు ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపల్ డాక్టర్ పాండురంగన్ తెలిపారు. కళాశాలకు చెందిన వినయ్‌కుమార్, సంధ్య, సైఫుల్లా, దినేష్, గిరి, కౌసర్ నయీమ్, శరణ్య, అజీజ్ మహ్మద్, షేక్ గైబున్నీసా, షేక్ అబ్దుల్లా ఉద్యోగాలు సాధించారన్నారు. వీరికి ఏడాదికి రూ.4లక్షలు నుంచి రూ.7లక్షల వరకు వేతనం ఇస్తారని టిపిఒ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరికుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరెడ్డి, ఎంబిఎ హెచ్‌ఒడి షబానాబి, అధ్యాపకులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

పగిలిన గుడ్లు గర్భిణులకు ఇవ్వొద్దు

గాలివీడు : గర్భిణులకు, బాలింతలకు, చంటి బిడ్డలకు పగిలిన గుడ్లు ఇవ్వరాని ఐసిడిఎస్ లక్కిరెడ్డిపల్లి సిడిపిఒ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం గాలివీడులోని పకీర్‌రెడ్డి గారి పల్లి అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు, బాలింతలనుద్దేశించి మాట్లాడారు. అంగన్వాడి కేంద్రం నుంచి పగిలిన, చెడిపోయిన గుడ్లను పంపిణీ చేయరాదని తెలిపారు. ఏజెన్సీతో మాట్లాడి నాణ్యమైన గుడ్లు, పాలు వచ్చేలా చూస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సెక్రెటరీ, మహిళా కానిస్టేబుల్, సూపర్‌వైజర్ సోనీ, విజయమ్మ, అంగన్వాడీ టీచర్లు లక్ష్మీదేవి, ఓబులమ్మ, పలువురు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

వీరబల్లి : సేంద్రీయ వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎపిసిఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. మం డలంలోని డి.రాచపల్లి పంచాయతీ కళ్లేవాండ్లపల్లిలో విఒఎ గ్రూపు సభ్యులకు సేంద్రియ వ్యవసాయంపై సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విఒఎ వీరాంజనమ్మ గ్రూపు సభ్యులకు ఘన జీవామృతం తయారుచేసి చూపించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లా డుతూ వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగం ఎక్కువైందని, దీని వల్ల భూమి నిస్సారమై ప్రతి ఏడాది దిగుబడులు కూడా తగ్గిపోతున్నాయని చెప్పారు. పంట ఉత్పత్తుల్లో క్రిమినాశిని అవశేషాలు వెలుగు చూస్తున్నాయని తెలిపారు. ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని, ఈ పరిస్థితుల్లో సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేయాలని చెప్పారు.

క్రైం కార్నర్

యుసిఐఎల్ ఉద్యోగి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

యుసిఐఎల్ ఎ ఎండి ఆపరేటర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి రామాంజనే యులు (28) మృతదేహం కాలు వలో లభ్యమైంది. ఆదివారం సాయంత్రం నల్లపు రెడ్డిపల్లె దారిలో ఉన్న కాలువ గట్టున మోటర్ వెహికల్ గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కాలువలో గాలింపు చర్యలు చేపట్టారు. మృతదేహాన్ని సోమవారం కనుగొని బయటకు తీశారు. ప్రభుత్వా సుపత్రిలో శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని పట్టణ సిఐ నరసింహులు తెలిపారు. రామాంజనేయులు సొంతగ్రామం వేముల మండలం మబ్బుచింతలపల్లె. ప్రస్తుతం పట్టణంలోని ఎరుగుడిపల్లెలో నివాసం ఉంటున్నాడు. ఆదివారం పూజలు చేయించుకుని ఆ సామాగ్రిని కాలువలో కలపడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ అందులో పడి, ఈతరాక మునిగిపోయినట్లు ప్రాథమిక విచారణలో తెలిసిందని సిఐ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. సంఘ టనకు గల కారణాలు పూర్తి విచా రణ తర్వాత వెల్లడిస్తామని సిఐ పేర్కొన్నారు.



రామాంజనేయులు మృతదేహం

IN THE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE OF PRODDATUR

I.A.No. 157/2023

O.S.No. 118/2017

Rachamallu Krishnaveni, W/o Pullareddy aged 45 years, Hindu House Wife R/o.3/678 YMR Colony Proddatur Town Kadapa Dist.

...Petitioner/Plaintiff

Vs

1)Jampala Subbamma, W/o late Subbareddy aged 60 years, Hindu, House wife, R/o.1/156, Dorasani palli villege, Proddatur Mandal, Kadapa Dist.
3)Jampala Yaswanth Reddy, S/o late Subbareddy aged 15 years, Hindu, Student, Minor.
4)Jampala Niharika D/o late Subbareddy aged 13years Hindu Student Minor 3 and 4, R/o, D.No. 3/208-4, 4Th floor, Upstair Balajinilayam, Thyagaraja Hospital line, Ymr Colany,Proddatur town, kadapa Dist.

...Respondents/Defendants

NOTICE

పై నెంబర్ దావాలో రెండవ ప్రతివాది జంపాల మహేశ్వరి గారు 3,4 ప్రతివాదులు, రెస్పాండెంట్స్ Guardianగా ఉండగా ప్రస్తుతం 3,4 రెస్పాండెంట్స్ Major అయినందున declare చేయకోరి I.A.157/2023 పిటిషన్ దాఖలు చేసి ఉంటున్న, అట్టి పిటిషన్లో మీరు హాజరు అగుటకు 20/12/2024వ తేదీన వాయిదా ఉంటున్నది. సదరు వాయిదా నాడు ఉదయం 10.30ని లకు కద్దున గాని, వకీలు ద్వారా గానీ ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలెను. లేని ఎడల మీ యెడల Exparteగా తీర్మానించబడును.

వాయిదా తేదీ : 20.12.2024

//By Order of the Court//

C. SYAMA SUNDAR REDDY,
V. NANDA KISHORE REDDY
Advocates,
PRODDATUR.